


**(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)**

**104**

**(20' డిసెంబర్ 69, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**కొందరు మహానుభావులకు,** అసలీ ప్రపంచం వంక చూడటానికీ, ఇతరుల్ని పలకరించడానికీ, వారు చెప్పినమాట ఆలోచించటానికీ జవాబు చెప్పటానికీ ఎంతమాత్రం ఇష్టం ఉండదు.

ఎంతో చెప్పగా విని విని ఒకసారి చెవులో జోరీగ దూరిన గొర్రెలాగా తలతిప్పుతారు. లేకపోతే నొప్పులు వచ్చి ఆగిపోయిన గర్భిణీ స్త్రీలాగా ఒకసారి పొట్టపట్టుకుని, "అ, ఉ" అంటారు. ఆ మూలుగుడికి అర్థం అవుననో కాదనో నిర్ణయించడం కష్టం.

ఈ రకమయిన మనస్తత్వాలు ఎందుకు వస్తాయి. అనే విషయం మీద పరిశోధనలు చెయ్యడం అనవసరమనిపిస్తుంది. ఒకాయన ఈ సందర్భంలో మాట్లాడుతూ ఆ పిచ్చి కళలకు కారణం - "మనస్సులో గర్వం దాగి అయినా వుండాలి. లేదా ఏదో అసమర్ధత లలా అతడిని ఆవరించి అంకిళ్ళు నొక్కి అయినా వుండాలి" అన్నాడు ఇదోరకమైన విచిత్రతత్వం.

ఇలాటి వాళ్ళు సంసారాల్లో ఎలా ప్రవర్తిస్తారనేది కూడా నివారించవలసిన విషయమే. కాకపోతే కాపురం చేసే ఇల్లాలు, కన్న సంతానం - ఇది నిత్యం వుండే ప్రారబ్ధమేగదా అని పట్టించుకోవడం మానేసి వుంటారు. లేకపోతే ఆయన మూలుగుళ్ళకు వ్యాఖ్యానాలు ఎక్కడ వ్రాయగలరు?

కొందరు ఏ సమయంలోనన్నా కనిపించనివ్వండి ఒకటే రకం ధోరణిలో ఒకటే విషయం మీద మాట్లాడి మన బుర్రల్ని అప్పడాల పిండి ముద్దలాగా చేసి 'అనవసర విషయాలు' అనే పీట మీదవేసి బాది మధ్య మధ్య వాళ్ళ చాదస్తమనే చమురులో చేయి తడిచేసుకుని మన బుర్ర మళ్ళీ ఏ వారానికోగానీ పనికిరాకుండా చేస్తూ వుంటారు.

చీకటి బజారులో పందికొక్కు గోతులు త్రవ్వి పది రాళ్ళు ఈడ్చుకొచ్చిన పెద్దమనిషి ఒకాయన ఉన్నాడు. ఆయన గారెప్పుడు కనిపించినా "చూడండి, ప్రపంచంలో ఏదైనా సాధ్యంగానీ, ఒకళ్ళకిచ్చిన డబ్బు తిరిగి రావడం మాత్రం అసాధ్యంగా వుంది."

"ఏం చెప్పమంటారు? అలా వుంది కాలం. ఇచ్చేదాకా ఇలవేల్పులులాగా తిరుగుతారు ఇంటిచుట్టూ. జాలిపడి చేతిలో వేశామో మన వీధివంక చూడరు. మన మాట అట్టేపెట్టి ఏం చెప్పమంటారు అవస్థ. ఒకడికి భార్య పురుడంటే నూరు రూపాయలిచ్చి ఆ పిల్లకు అయిదో ఏడు. అయిదు రూపాయలు జమచేస్తే ఒట్టు పెట్టండి.

"పోనీ వెయ్యకపోతే ఇలా ఇచ్చుకోలేకపోయాను. ఫలానా కారణాలవల్ల తను వచ్చి చెప్పి పోకూడదూ? చస్తే రాడు. వాడికేం ఎందుకు రావాలి? వందరూపాయలు అలాగ్గా సంపాదించాడు.

"ఇంట్లో అంతా క్షేమమా?" మొన్నీమధ్య సందుచేసుకుని అడిగితే "ఏం క్షేమం? నేనిలా అప్పులు పెట్టి ఆస్తంతా నాశనం చేస్తుంటే వాళ్ళేం క్షేమంగా వుంటారు. నామీద కక్షకట్టి చూస్తున్నారు" అని ఎంతో ఫీలయిపోతాడు.

ఆ జీవితంలో మరో సంభాషణ వింటామనిగానీ, ఆయన మనస్సు మార్చుకుని మనం చెప్పేది వింటాడని ఆశపడవలసిన అవసరం ఎంతమాత్రం లేదు. ఆయన గుండెల్లో ఎప్పుడూ ఆ పాత రికార్డే తిరుగుతూ వుంటుంది. అరిగిపోకుండా కొంచెమైనా చెరిగిపోకుండా.

కొందరు ప్రబుద్ధులు ఎదురైనప్పుడు పలకరించకపోతే బాగుండదని "ఎక్కడ నుంచి రావడం?" అంటామనుకోండి. "ఏం చెప్పను? ఒక చోటేమిటి ఇక్కడికి ఆరురోజులనుంచీ ఇందుగలడందులేదను సందేహము వలదు అన్నట్లు తిరుగుతున్నాను. ఆరు రోజుల క్రిందట హైదరాబాదు, మర్నాడు నిజామాబాద్, మర్నాడు తిరిగి హైదరాబాద్, ఆ మర్నాడు వరంగల్లు. ఉన్నది అయిదు గంటలే అక్కడ. ఆ పని చూసుకుని సరాసరి ఖమ్మం మెట్టు, అక్కడో మనిషితో మాట్లాడి మొన్న ఉదయం బెజవాడ చేరుకున్నా - నిన్న ఉదయం మళ్ళీ జగ్గయ్యపేట. తీరా అక్కడికి వెడితే కావలసిన మనిషిలేడు.

ఆయనకోసం వెళ్ళి ఆయన్ని పట్టుకుని మాట్లాడి రాత్రికి ఒంటిగంటకు విజయవాడ చేరుకున్నా. తీరా చూస్తే తెల్లారి రుద్రవరం వెళ్ళవలసి వచ్చింది. వెళ్ళి అరగంట క్రిందే చేరా. ఇంకా ఇంటికి వెళ్ళలేదు. ఇదుగో వచ్చే ఫిబ్రవరివరకు ఇలాగే వుంటుంది. తర్వాత రెండు నెలలు ఖాళీ. ఎక్కడికీ వెళ్ళను. అప్పుడు కలుస్తా తీరిగ్గా" అంటూ వెళ్ళిపోతాడు.

అంత సోది చెప్పినందుకు మనస్సులో బాధపడుతున్నా. మరోమూడు మాసాలదాకా తీరిక లేదని చెప్పినందుకు అభినందిస్తూ అక్కడినుంచి అవతలకు సాగడం జరుగుతూ వుంటుంది.

మరో రకం పెద్ద మనుష్యులుంటారు వారెప్పుడూ ఏదో ఒక పెద్ద ప్లాను వేసుకుని మాట్లాడతారు తప్ప మామూలు సంభాషణ అంటూ వారి నోటినుంచి వినిపించదు. "ఇదుగో ఫలానా వ్యక్తికి సన్మానం చేయాలనుకుంటున్నాం. గ్రాండుగా చెయ్యాలి. అధ్యక్షుడిగా ఎవర్ని పిలిస్తే మంచిదంటారు? రాష్ట్రపతి అయితే బాగుంటుందనుకోండి. ఆయన ఇటు ఎప్పుడు వస్తారో కనుక్కుని వ్రాస్తే ప్రోగ్రాంలో పడిపోతుంది. ఇది ఒకటి మనసులో వున్నదనుకోండి. మరొకరెవరైతే బాగుంటుంది. రాధాకృష్ణన్‌గారైతే బాగుంటుంది కానీ బహుశః ఆయన ఎక్కడికీ రారంటున్నారు. అలాంటప్పుడు మనం కోరడం కూడా అంతగ బాగుండదు. అధ్యక్షుని సంగతి తేలితేగానీ ఉపన్యాసకుల సంగతి తేలదు. అదీ వచ్చింది చిక్కు"

అని నిజంగా ఏదో గొప్ప చిక్కులో పడ్డవాడిలాగా బాధపడతాడు.

కొంచెం సేపు ఆగిన తర్వాత "పోనీ సినిమాకు చెందిన వాళ్ళెవళ్ళనైనా పిలిస్తే రాజకపూర్ అయితే తప్పకుండా వస్తాడు. "ఏం ఒకసారి ఇలాగే ఉత్తరం వ్రాస్తే ప్రస్తుతం తీరుబడిలేదు. కనుక క్షమించండి అని వ్రాసాడు.

ఈసారి వ్రాస్తే మటుకు కాదనడు. కానీ అతణ్ణి పిలవడమా దేవానంద్‌నా? అని సందేహంగా వుంది. మా చెల్లెలువాళ్ళు "ప్రతి సభకూ మొగవాళ్ళను పిలవడమేనా? ఈసారి నూతన్‌ని గానీ, లతామంగేష్కర్‌ని గానీ పిలవండి. మంగేష్కర్ అధ్యక్షోపన్యాసం ఇవ్వలేకపోవచ్చు. కానీ రెండు పాటలు పాడితే పాతిక ఉపన్యాసాలతో సమానం అంటున్నారు. మీ ఉద్దేశ్యమేమిటి?" అని సూటి ప్రశ్న.

"మీరు పిలిపించాలే గానీ అంతకన్నా కావలసిందేముంది? సభ సర్వాంగశోభితంగా వుంటుంది. దిగ్విజయంగా సాగుతుంది అంటాం మనం.

ఆయన ముసి ముసి నవ్వులు నవ్వుతూ కొంచెం ముందుకు పోయి మళ్ళీ వెనక్కి వచ్చి "అయితే వీళ్ళంతా వాళ్ళ ఖర్చులమీద వాళ్ళే వస్తారుగా. మనల్నేమీ అడగరుగా అని ప్రశ్న."

"వ్రాసి చూడండి. తేలిపోతుంది" అంటాం.

"అంతేలెండి లేకపోతే మనమెక్కడ భరిస్తాం. మా సభ్యుల పేర్లు వున్న ఇళ్ళూ వాకిళ్ళూ అమ్మాలి. సన్మానం జరగకపోతే మానే" అంటూ వెళ్ళిపోతాడు.

ఈ సన్మానాల ప్లేట్లు విసుగులేకుండా వీధివీధినా పెట్టేవాళ్ళు కొందరున్నారు.

Post your comments